# పదండి పోదాం ఎగ్జిబిషన్!

శాంతారాం, వాళ్ళావిడ నాగమణి, నాలుగేళ్ళ బాబు డింగరితో కలిసి లంకలకోడేరు నుండి బంధువుల పెళ్ళికని హైదరాబాదు వచ్చాడు. పెళ్ళయిగ తరువాత హైదరాబాదులో తన చిన్ననాటి స్నేహితుడైన రామేశం ఇంటికి వెళ్ళాడు.

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక వరండాలో కూర్చుని మాటల్లో పడ్డారు వాళ్ళు.

"మేము రేపొద్దున్న ఫస్టు బస్సుకి మా ఊరెళ్ళిపోతామోయ్...." మాటల మధ్యలో రామేశంతో అన్నాడు శాంతారాం.

"అదేంటోయ్ అప్పుడే పెళ్ళిపోతానంటావేం?.... మనం కల్సి నాలుగు సంవత్సరాలైంది.... ఓ రెండ్రోజులు ఉండెళ్ళు...." అన్నాడు రామేశం.

"అవునండన్నయ్యగారూ....ఓరెండ్రోజులుండి వెళ్ళండి...." అంది రామేశం భార్య లక్ష్మి.

"ఆయనకి బోల్డన్ని పనులున్నాయమ్మా...." అంది శాంతారాం భార్య నాగమణి.

"మనం మళ్ళి ఎప్పుడు కలుస్తామో ఏమో.... ఓ రెండ్రోజులుండి వెళ్ళు— సర్దాగా గడుపుదాం...." అన్నాడు రామేశం.

"సర్లే.... అలాగే.... నీ మాటెందుకు కాదనాలీ" అని హఠాత్తుగా శాంతారాం కెవ్వుమని గట్టిగా కేకేశాడు.

ఆ అరుపుకి రామేశం బోర్లా, లక్ష్మి వెల్లకితలా పడిపోయారు. వాళ్ళ పాప సీతాలు జడుసుకుని బేర్‌మని ఏడ్వడం మొదలు పెట్టింది.

"వీళ్ళ మొహాలకి నాన్న అరుపులు అలవాట్లేదు.... అందుకే ఇట్టా భయపడిపోయారు కదే అమ్మా!— హిహి—హి..." అన్నాడు డింగరి.

రామేశం, లక్ష్మి కిందనుండి లేచి మళ్ళీ సోఫాలో కూర్చున్నారు. లక్ష్మి సీతాలుని ఎత్తుకుని ఊరుకోబెట్టసాగింది.

"అదేంటోయ్ అంత చేటున అట్టా అరిచావ్?" అని అడిగాడు రామేశం.

శాంతారాం సిగ్గుపడ్డాడు.

"మరేమో నాకేమో హఠాత్తుగా ఓ విషయం గుర్తుకొచ్చింది. ఈ ఊళ్ళో ఎగ్జిబిషన్ ఉందటగా మా ఊళ్ళో చెప్పారు చాలా బాగుంటుందనీ తప్పకుండా చూసి రమ్మనీ మరేయో రేపు మనందరం ఎగ్జిబిషన్‌కి వెళ్దామా అన్నాడు ఉత్సాహంగా శాంతారాం.

ఆ మాట వింటూనే రామేశం గట్టిగా కెవ్వుమని అరిచాడు.

"ఎగ్జిబిషనా ఛీయాక్ వద్దు ఏం బాగుండదు? హిహి నిజంగానే బాగుండదు హిహిహి" నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు రామేశం.

"మీరు ప్రతీ సంవత్సరం చూస్తారు కాబట్టి మీకేం కొత్తగా అనిపించక పోవచ్చు కానీ మాకు కొత్తగా బాగానే ఉంటుంది. మరి రేపు ఎగ్జిబిషన్‌కి వెళ్దామా?" అన్నాడు శాంతారాం.

"అన్నట్టు నీకు మీ ఊళ్లో ఏవో చాల పన్లున్నాయని ఇందాకన్నట్టున్నావ్ అనవసరంగా పన్లు పాడయ్‌పోతాయేమో పోనీ రేపు ఫస్ట్‌బస్‌కి మీ ఊరెళ్ళిపోకూడదూ? హిహి నువ్విక్కడుంటే మాకిబ్బందని కాదు. నీ పన్లు పాడయ్‌పోతాయేమోనని. అంతే. హిహి మరి ఊరెళ్ళిపోతావా? ఆఁ?" అడిగాడు రామేశం ఇబ్బందిగా నవ్వుతూ.

"ఆ పన్లదేముందీ ఎప్పుడూ ఉండేవే. మళ్లీ మనం ఎప్పుడు కలుస్తామో ఏమో! మరి రేపెగ్జిబిషన్ వెళ్దామా?" అన్నాడు శాంతారాం హుషారుగా.

"ఆ ఆ వెళ్దాం ఎందుకెళ్ళొద్దూ? అలాగే వెళ్దాం" అంటూ పళ్ళు కొరికాడు రామేశం.

ఆ మర్నాడు కాస్త చీకటి పడ్డాక అందరూ కల్సి ఎగ్జిబిషన్‌కి వెళ్ళారు.


"ఆ హాహ ఏం లైట్లూ? ఏంపెల్తురూ! కనులవిందుగా ఉందనుకో" అన్నాడు శాంతారాం పైకి చూస్తూ.

"లైట్లుంటే పెల్తురుండదు మరి?" పళ్ళు కొరుకుతూ అన్నాడు రామేశం.

ఇంతలో ఉన్నట్టుండి "ఫాయ్" అంటూ పెద్దగా శబ్దం వచ్చింది.

"భలే భలే" ఇక్కడెవరో బాకాలు ఊత్తున్నారు" సంబరంగా అన్నాడు శాంతారాం.

"భాకాలా నా బొంద? ఓసారి వెనక్కి తిరిగి చూడు" మళ్ళీ పళ్ళు నూర్తూ అన్నాడు రామేశం.




శాంతారాం వెనక్కి తిరిగి చూశాడు.

డింగరి, సీతాలు గొంతెత్తి ఏడుస్తున్నారు.

శాంతారాం కంగారు పడిపోయాడు.

"వీళ్ళెందుకిట్టా ఏడుస్తున్నారు?" అడిగాడు ఆడవాళ్ళని.

"వాళ్ళకి బెలూన్లు కావాలంట!" లక్ష్మి, నాగమణి చెప్పారు.

రామేశం నెత్తి కొట్టుకున్నాడు.

"ఇంకా గేట్లోంచి లోపలికి వెళ్ళనే లేదు అప్పుడే మొదలయ్యిందా గోల?" అంటూ జేబులోంచి డబ్బులు తీసి రెండు బెలూన్లు కొని పిల్లలకి చెరొకటి ఇచ్చాడు.

లోపలికి వెళ్ళడానికి టిక్కెట్లు కొంటుంటే శాంతారాం ఆశ్చర్య పోయాడు.

"హార్రే!.... టిక్కెట్టుకి అర్ధరూపాయేనా? ఎంత చవకో....ఇంత జనుల పండుగ్గా ఉంది.... అర్ధరూపాయేనా?" మూడు రూపాయల్లో ఎం చక్కటి కాలక్షేపమో!! కేవ్వ్ అన్నాడు ఆనందంగా.

"మరే మరే మూడ్రూపాయలే లోపలికిపద తెలుస్తుంది" అన్నాడు రామేశం క్రూరంగా చూస్తూ.

అందరూ ఎగ్జిబిషన్ లోపలికి అడుగు పెట్టారు.

అడుగు పెట్టిన అక్షణానికే ఆడాళ్ళిద్దరూ కెవ్వుమని అరిచారు.

రామేశానికి ప్రమాదం అర్ధం అయ్యింది కానీ శాంతారాంకి అర్ధం కాలేదు.

"మీరెందుకిలా అరిచారు? కుర్రసన్నాసులు మళ్ళి ఏమైనా కొన మన్నారా?" అంటూ వాళ్ళని అడిగాడు శాంతారాం.

"అటు చూడండి ఏముందక్కడ?" చిలిపిగా చూస్తూ భర్తని అడిగింది నాగమణి.

"చీరల షాపులు!" అన్నాడు శాంతారాం.

"హబ్బ ఎంత బాగున్నాయో! మరేమో మీరు నాకిప్పుడు చీరలు కొంటారుట!

"ఇప్పుడా? ఇప్పుడెందుకూ?? మనూర్లో కొనుక్కుందాంలే. అక్కడైతే చవక" అన్నాడు కంగారుపడుతూ.

"హైదరాబాద్‌లో ఎగ్జిబిషన్‌కెళ్ళి ఏమీ కొనలేదంటే అందరూ నవ్వుతారు. చాల్లే నోర్మూయ్యండి" అంటూ భర్తచెవి మెలేసింది నాగమణి.

శాంతారాం ముఖం వివర్ణమైంది.

"అయ్యిందా పెళ్ళి మూడు రూపాయలకే ఎంటర్‌టైన్‌మెంటని అన్నావుగా అఘోరించు" క్రూరంగా నవ్వుతూ అన్నాడు రామేశం.

"అతన్ననగానే సరిపోదు మీరు కూడా అఘోరించాలి! నాకు కూడా చీరలు కొనాలి!" అంది రామేశంతో లక్ష్మి.

మగాళ్ళిద్దరూ తలలు బాదుకుంటూ బట్టల షాపు దగ్గర ఆగారు.

దాదాపు రెండు గంటలు అన్ని షాపులూ తిప్పి తలొక రెండు చీరలూ కొనుక్కున్నారు ఆడాళ్ళిద్దరూ.

"ఎగ్జిబిషన్‌లో మిరపకాయ బజ్జీలు బావుంటాయటగా?" అడిగాడు శాంతారాం బజ్జీల దుకాణం వంక చూసి లొట్టలు వేస్తూ.

"ఊ పద" పళ్ళు నూరుతూ అన్నాడు రామేశం.

"బాబూ! మిరపకాయ బజ్జీలెంత?" అడిగాడు శాంతారాం.

"రెండు రూపాయలకి మూడు"

"కెవ్వ్ ఎంత చవకో! మన లంకల కోడేర్లో అయితే రెండు రూపాయలకి డజను బజ్జీలు ఇస్తారు. ఇక్కడ మూడు డజన్లు ఇస్తున్నారు కదే!" అన్నాడు నాగమణితో.

"ఛత్ నీయవ్వ! కొండాని కొచ్చినావా మజాకులు చెయ్యనీకొచ్చినావా" అంటూ షాపువాడు శాంతారాంని కోప్పడ్డాడు.

"మజాకులు చెయ్యడానికి కాదులే బాబూ అతనిది ఈ ఊరు కాదు ఏమీ అనుకోకు" అని షాపు వాడికి సర్దిచెప్పి "రెండురూపాయలకి మూడు బజ్జీలే మూడు డజన్లు కాదు" అని శాంతారాంతో చెప్పాడు రామేశం.

శాంతారాం కెవ్వుమని అరిచాడు.

అక్కడే ఏదో తుక్కు పిండితో చేసిన బజ్జీలు తిని ముందుకు కదిలారు వాళ్ళు.

నాలుగడుగులు వేశారో లేదో ఉన్నట్టుండి పిల్లలిద్దరూ "హాయ్" అంటూ బాకాలూదినట్టు ఏడవడం మొదలెట్టారు.

కారణం అక్కడో బొమ్మల కొట్టు ఉంది.

డింగరి తనకి బొమ్మల కొట్టంతా కావాలని మారాం చేశాడు. సీతాలైతే "సగం కొట్టు నాకూ సగం కొట్టు డింగరికీ" అని గోల పెట్టింది.

వాళ్ళిద్దరికీ ఏకంగా కొట్టు మొత్తం అడక్కూడదని నచ్చజెప్పి చెరో రెండు బొమ్మలూ కొని ఊరుకోబెట్టే సరికి తల ప్రాణం తోక్కొచ్చింది. నాగమణి, లక్ష్మిలైతే గొలుసులు, హాండ్ బ్యాగులు, చెప్పులు ఇలా ఏ కొట్టు కనిపిస్తే దానిదగ్గర ఆగిపోయి బేరాలు చేయసాగారు. శాంతారాంకి పిచ్చెక్కిపోయి జుట్టు పీక్కున్నాడు.

"మూడు రూపాయలకి మంచి కాలక్షేపం! బాగుంది కదూ?" క్రూరాతి క్రూరంగా నవ్వుతూ అడిగి అనక కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు రామేశం.

మగాళ్ళిద్దరూ నానా హింసలూ పడ్డాక రాత్రి పదకొండుకి ఎగ్జిబిషన్ నుండి బయట పడ్డారు. అక్కడ చాలా ఆటోలున్నాయ్.

"పర్లేదే ఈ టైంలో కూడా ఇంటికి వెళ్ళడానికి వీలుగా చాలా ఆటోలున్నాయ్" అని "ఆటో వస్తావా!" అని తాముండే స్థలం పేరు చెప్పాడు శాంతారాం.

"ముప్పై రూపాయలౌతుంది" అన్నాడు ఆటోవాడు.

ఆ సమాధానం వింటూనే కెవ్వుమని అరిచి జుట్టు పీక్కుని ఫుట్ పాత్ మీద కూర్చుండి పోయాడు శాంతారాం.